క్లుప్తంగా

సీఎన్‌జీ స్టేషన్ ప్రారంభం



సంగం: స్థానిక భారత్ పెట్రోల్ బంకులో సీఎన్‌జీ ఫిల్లింగ్ స్టేషన్‌ను బుధవారం ప్రారంభించారు. రిటైల్ మేనేజర్ మనోజ్ కన్నారిల్ మాట్లాడుతూ జిల్లాలో 11 ప్రాంతాల్లో గ్యాస్ కేంద్రాలు ప్రారంభించామని తెలిపారు. ఏపీ మార్కెటింగ్ హెడ్ శేఖర్ వజ్జల, భారత పెట్రోల్ బంకు నిర్వాహకులు బాలబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

కొండచిలువ కలకలం

సోమశిల: అనంతసాగరం మండలం లింగంగుంటలో బుధవారం కొండచిలువ కలకలం రేపింది. చింతాలమ్మ గుడి సమీపంలో కోడి పుంజును మింగి గ్రామస్తుల కంటపడగా, తొలుత భయభ్రాంతులకు గురయ్యారు. ఆ తరువాత దానిని హతమార్చారు.

క్రీడాకారులకు అభినందన



కలిగిరి: రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ నెట్‌బాల్ పోటీల్లో అండర్–17 విభాగంలో తెల్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారని హెచ్‌ఎం ఎస్ వెంగయ్య తెలిపారు. బుధవారం పాఠశాలలో రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో ప్రతిభకనబర్చిన క్రీడాకారులు, పీఈటీ తిరుపాల్‌రెడ్డిని ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ రెండ్రోజుల క్రితం ఆత్మకూరులో జరిగిన రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో జిల్లా బాలుర జట్టు ప్రథమ, బాలికల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయని తెలిపారు. బాలుర జట్టులో దమ్ము వెంకటజతిన్, బాలికల జట్టులో కొప్పోలు నవ్య, దామెదర మోహనసంగీత, దామెర చైత్ర, ఒంటేరు వర్ష సత్తాచాటారని వివరించారు.

జంతువులను సంరక్షించుకోవాలి

వరికుంటపాడు: అంతరించిపోతున్న జంతు సంపదను ప్రతిఒక్కరూ సంరక్షించుకోవాలని పెద్దిరెడ్డిపల్లి పశువైద్యాధికారి ఎస్వీఎస్ రాఘవేంద్ర శర్మ అన్నారు. జంతు సంక్షేమ పక్షోత్సవాల్లో భాగంగా పెద్దిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో 8,9 తరగతుల విద్యార్థులకు 'అంతరించిపోతున్న జంతుజాతులు–సంరక్షణలో మన పాత్ర' అనే అంశంపై వక్తృత్వ, వ్యాసరచన పోటీలను బుధవారం నిర్వహించారు. విజేతలకు బహుమతులు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

సోమశిల: సోమశిలలోని సోమేశ్వరాలయ ప్రాంతానికి చెందిన గిరిజనుడైన శ్రీను తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండగా హిల్‌కాలనీ మామిడిచెట్ల సెంటర్ యువత బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటరమణ ఆధ్వర్యంలో వైద్యఖర్చులకు రూ.3,300 అందజేశారు. శ్రీనును దాతలు ఆదుకోవాలని కోరారు. ముక్కు మస్తాన్‌గౌడ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

ఆత్మకూరు: మోటార్‌సైకిల్ ఢీకొనడంతో మహిళ తీవ్రంగా గాయపడిన ఘటన నారంపేట వద్ద బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు..నారంపేట వద్ద ఉన్న తోటల్లో గిరిజన మహిళ బుజ్జమ్మ, పెంచలయ్య దంపతులు కాపలాగా ఉంటున్నారు. బుజ్జమ్మ రాత్రి తోట వద్ద ముంబయి రహదారిని దాటుతున్న క్రమంలో ఇద్దరు వ్యక్తులు మద్యం మత్తులో మోటార్‌బైక్‌పై వేగంగా వస్తూ ఢీకొని పరారయ్యారు. ఈ ప్రమాదంలో బుజ్జమ్మ తీవ్రంగా గాయపడగా బంధువులు ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాద ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అంగన్‌వాడీల ప్రదర్శన

ఆత్మకూరు: తమ న్యాయమైన కోర్కెలను తీర్చాలని పట్టణంలోని సీడీపీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు బుధవారం ప్రదర్శన నిర్వహించారు. కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలని, ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని, వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచాలని కోరారు. అనంతరం సీడీపీఓ పద్మావతికి వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ కార్యదర్శి కే హజరత్తయ్య, అంగన్‌వాడీ యూనియన్ కార్యనిర్వాహకులు పీ రాధమ్మ,కే రమణమ్మ, సుప్రజ, సుజాత, విజయలక్ష్మి పాల్గొన్నారు.

క్రీడాసామగ్రి అందజేత



ఆత్మకూరు: పట్టణానికి చెందిన అండర్–14, అండర్–17 ఫుట్‌బాల్ క్రీడాకారులకు రూ.10వేల విలువైన క్రీడా సామగ్రిని డాక్టర్ జే ప్రణీత్ బుధవారం అందజేశారు. పేద కుటుంబాలకు చెందిన క్రీడాకారులకు భవిష్యత్‌లోనూ తన వంతు సహకారం అందిస్తానని డాక్టర్ ప్రణీత్ హామీ ఇచ్చారు. 15వ వార్డు సచివాలయ కన్వీనర్ పీ ఆదినారాయణ, క్రీడాకారులు రాహుల్, ప్రణీత్, సందేశ్, డాక్టర్ కుమార్, అశోక్, ఫుట్‌బాల్ కోచ్ కనిష్కచక్రవర్తి పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం



కావలి: ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్డీఓ శీనానాయక్



ఆత్మకూరులో సీనియర్ ఓటర్లను సత్కరిస్తున్న ఆర్డీఓ కరుణకుమారి



జలదంకిలో..



ఉదయగిరిలో..



మర్రిపాడులో సీనియర్ ఓటర్లకు సన్మానం



ఏఎస్‌పేటలో..



అనంతసాగరంలో..



సంగంలో..

కావలి: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధంతో సమానమని, యువత ఓటు హక్కుపై అవగాహన పెంచుకుని సరైన నాయకులను ఎన్నుకుని దేశాభివృద్ధికి పాటుపడాలని ఆర్డీఓ శీనానాయక్ తెలిపారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో ఓటు హక్కుపై భారీ అవగాహన ర్యాలీని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును దుర్వినియోగం చేసుకోకుండా సరైన నాయకులను ఎన్నుకుని మీ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. అనతరం ఓటు హక్కుపై యువకులకు అవగాహన కల్పించి వారితో ప్రతిజ్ఞ చేయించారు. మున్సిపల్ కమిషనర్ బీ శివారెడ్డి, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కావలి రూరల్: పట్టణంలోని డీబీఎస్ కళాశాలలో కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపల్ టీవీ రావు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

అల్లూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీదేవి, నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ ఫణికుమార్, అల్లూరు–1 సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్ ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏఓ మస్తాన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటును సద్వినియోగం చేసుకోవాలి

ఉదయగిరి: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకుని ప్రజాస్వామ్య విలువను కాపాడాలని ఉదయగిరి నియోజవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకట్రావు పిలుపునిచ్చారు. పట్టణంలో ఓటు హక్కుపై నిర్వహించిన అవగాహనా ర్యాలీలో ఆర్‌ఓ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. యువతతో ప్రతిజ్ఞ చేయించారు. తహసీల్దార్ సానా శ్రీనివాసులురెడ్డి, ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్, ఎంఈఓ మస్తాన్‌వలి, ఉపాధ్యాయులు, రెవెన్యూ సిబ్బంది, బీఎల్వోలు పాల్గొన్నారు.

• అప్పసముద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించి మానవహారం నిర్మించారు

వింజమూరు: పట్టణంలో తహసీల్దార్ సీహెచ్ రవీంద్రబాబు ఆధ్వర్యంలో విద్యార్థులతో మెయిన్‌రోడ్డులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బంగ్లాసెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు.

వరికుంటపాడు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

జలదంకి: మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సీహెచ్ పద్మావతి ఆధ్వర్యంలో ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత ఉన్నత పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఓటరు నమోదులో ప్రతిభ చూపిన జమ్మలపాళెం బీఎల్వో నీలిమతో పాటు సీనియర్ ఓటర్లను సన్మానించారు. డీటీ భరత్, ఆర్‌ఐ శ్రీజ, వీఆర్వోలు, బీఎల్వోలు పాల్గొన్నారు.

కలిగిరి: స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి కలిగిరమ్మతల్లి ఆలయం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్మించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, ఎస్సై ఎం సూర్యప్రకాష్‌రెడ్డి, పలుశాఖల అధికారులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు వినియోగించుకోవాలి

ఆత్మకూరు రూరల్: ప్రజాస్వామ్యంలో కీలకమైన ఓటును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఆత్మకూరు ఆర్డీఓ కరుణకుమారి అన్నారు. మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ నరసింహం ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఆర్డీఓ ముఖ్యఅతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. సీనియర్ ఓటర్లను సత్కరించారు. డీటీ రాజేష్, ఆర్‌ఐ పృథ్వీ, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్ వాసుబాబు,ఎన్ఎస్ఎస్ కోర్డినేటర్ డీ వేణుగోపాల్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంగం: తహసీల్దార్ లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం నుంచి ఉన్నత పాఠశాల వరకు విద్యార్థులతో ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో మానవహారం నిర్మించి ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీఓ గోపి, ఎంఈఓ జానకీరాం, వెలుగు ఏపీఎం పాల్గొన్నారు.

సోమశిల: తహసీల్దార్ అన్నదాత వెంకటరమణరావు ఆధ్వర్యంలో అనంతసాగరం తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్మించి ప్రతిజ్ఞ చేయించారు. స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ బట్రెడ్డి లక్ష్మీప్రసన్న, ఎమ్మార్పీ పోలంరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, వికాస్ కళాశాల కరస్పాండెంట్ జే నరసింహులు, ఉపాధ్యాయులు కరిమొహిద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట: మండల తహసీల్దారు కార్యాలయంలో సీనియర్ ఓటర్లను తహసీల్దార్ సుభద్ర శాలువాలతో సత్కరించారు. అనంతరం విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. డీటీ సతీష్‌కుమార్, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మర్రిపాడు: తహసీల్దార్ హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో మర్రిపాడులోని తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు. సీనియర్ ఓటర్లను సత్కరించారు. ఎంపీడీఓ నాగమణి, డీటీ ఆనందరావు, ఆర్‌ఐ సురేంద్ర, ఏఎస్‌ఓ కిషోర్, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉపాధిలో అక్రమాలకు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న పీడీ వెంకట్రావు

ఉదయగిరి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సిబ్బంది అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ వెంకట్రావ్ హెచ్చరించారు. ఉదయగిరి, సీతారామపురం మండలాల ఉపాధి సిబ్బందితో స్థానిక స్త్రీశక్తి భవనంలో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం జిల్లాకు అదనంగా 30 లక్షల పనిదినాలు కేటాయించిందని, ఈ లక్ష్యాన్ని మార్చి 31వ తేదీలోగా పూర్తిచేయాలన్నారు. వర్షాలు కురవడం, వ్యవసాయ పనుల కారణంగా ఉపాధి కూలీ హాజరు తగ్గిందన్నారు. వ్యవసాయ పనులు ముగిసినందున ప్రతి కూలీకి ఉపాధి పని కల్పించాలన్నారు. సీతారామపురం మండలంలో కూలీల సంఖ్యను పెంచాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, ఏపీఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు పురస్కారం

ఆత్మకూరు: గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో ఉత్తమ సేవలు అందించిన అధికారులకు అందజేసే ఉత్తమ సేవా పురస్కారానికి మున్సిపల్ కమిషనర్ ఎం రమేష్‌బాబు వరుసగా మూడోసారి ఎంపికయ్యారు. నెల్లూరులో గురువారం జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకోనున్నారు. ఈ సందర్భంగా కమిషనర్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

వీపీఏకు రాష్ట్రస్థాయి ఉత్తమ సేవా పురస్కారం



చేజర్ల మండలం మడపల్లి వ్యవసాయశాఖ సహాయకురాలు(వీపీఏ) మమత రాష్ట్రస్థాయి ఉత్తమ సేవా పురస్కారానికి ఎంపికైంది. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి సమాచారం అందింది. ఆత్మకూరుకు చెందిన మమత వీపీఏ గా అందించిన సేవలను గుర్తించి పురస్కారాన్ని ప్రకటించారు. విజయవాడలోని వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో గురువారం జరిగే వేడుకల్లో పురస్కారాన్ని అందుకోనున్నారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు అభినందనలు తెలిపారు.

పేద మహిళ వైద్యానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న సంయుక్త సేవాసంస్థ సభ్యులు

కావలి రూరల్: పట్టణంలోని ఇందిరానగర్‌లో నివాసం ఉంటున్న పేద మహిళ కే లలితకు వైద్యఖర్చుల నిమిత్తం సంయుక్త సేవాసంస్థ సభ్యులు బుధవారం రూ.11వేలు ఆర్థిక సాయం అందజేశారు. లలితకు కిడ్నీలో రాళ్లు ఏర్పడడంతో ఆపరేషన్ చేయించుకోవాలని వైద్యులు సూచించారు. దీంతో వైద్యఖర్చుల కోసం సంయుక్త సేవా సంస్థ సభ్యులను ఆశ్రయించగా, వెంటనే స్పందించి ఆర్థిక సాయం అందజేశారు. సంస్థ అధ్యక్షుడు సురేంద్ర, సభ్యులు ఎం అజిత్‌బాబు, ఎంవీఎస్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో ఆవు మృతి



విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన ఆవు

ఆత్మకూరు రూరల్: విద్యుత్‌షాక్‌తో ఆవు మృతి చెందిన ఘటన మండలంలోని రామస్వామిపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన రైతు అంబటి మాలకొండయ్య రోజులాగే తన పశువును మేతకు ఉత్తర కాలువ సమీపంలోని పొలాల్లోకి తోలుకెళ్లాడు. ఓ ఆవు మేత మేసే క్రమంలో ఉత్తర కాలువ పక్కన రక్షణ కంచెలేకుండా తక్కువ ఎత్తులో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. కాగా ఇటీవల ఉత్తర కాలువ అభివృద్ధి పనుల్లో భాగంగా విద్యుత్‌శాఖ అధికారులు రెండు, మూడు ట్రాన్స్‌ఫార్మర్లను మార్చి పక్కన కొత్తగా ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్లను ఎతైన దిమ్మెపై ఏర్పాటు చేసి చుట్టూ రక్షణ కంచె నిర్మించాల్సిన విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యం వహించారు. సోమశిల ప్రాజెక్ట్ అధికారులు నగదు చెల్లించలేదనే సాకుతో వరలపై తక్కువ ఎత్తులో రక్షణ కంచెలేకుండా ఏర్పాటు చేయడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇటీవల ఓ రైతుకు చెందిన గేదె సైతం విద్యుత్ షాక్‌తో మృతి చెందిందని తెలిపారు. ఈ విషయమై సోమశిల ప్రాజెక్ట్ డీఈ మురళీశంకర్‌రెడ్డిని సంప్రదించగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు తమ పరిధి కాదని, విద్యుత్ శాఖ పరిధి అన్నారు. విద్యుత్ ఏఈ వెంకటేశ్వర్లును వివరణ కోరగా, ఉత్తర కాలువ నిర్మాణ పనుల సమయంలో విద్యుత్‌లైన్ల పునర్నిర్మాణానికి రూ.3.60 లక్షలతో అంచనాలు పంపగా, ఇంతవరకు ప్రాజెక్ట్ అధికారులు డీడీలు చెల్లించకపోవడంతో విద్యుత్ సమస్యలు కొనసాగుతున్నాయన్నారు.

మాజీ ఎమ్మెల్యే గొట్టిపాటికి ఘన నివాళి



గొట్టిపాటి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కావలి రూరల్: ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్యే గొట్టిపాటి కొండపనాయుడు వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల వద్ద ఉన్న గొట్టిపాటి విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గొట్టిపాటి కావలికి సోమశిల జలాలను తీసుకొచ్చి రైతులకు అండగా నిలిచిన గొప్పవ్యక్తి అని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో ముందుగు సాగుతామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జలదంకి: గట్టుపల్లిలోని మాజీ ఎమ్మెల్యే గొట్టిపాటి కొండపనాయుడు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కాకర్ల చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు కాకర్ల సురేష్ ముఖ్యఅతిథిగా హాజరై గొట్టిపాటి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానికులు కొల్లా రాధాకృష్ణ, అంబటి ప్రసాద్‌నాయుడు, తలపనేని మధుసూదన్‌రావు, మోదేపల్లి మాలకొండయ్య, గొట్టిపాటి అభిమానులు పాల్గొన్నారు.

ఆవుల నుంచి పంటలను కాపాడాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

అల్లూరు: ఆవుల నుంచి తమ పంటలను కాపాడాలని నగర పంచాయతీ రైతులు కోరారు. ఈ మేరకు కమిషనర్ ఫణికుమార్, తహసీల్దార్ శ్రీరామకృష్ణ, ఎస్సై శ్రీనివాసులరెడ్డికి బుధవారం వినతిపత్రాలను అందజేశారు. ఆవులను విచ్చల విడిగా వదిలివేయడంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించడంతో పాటు పంటలను నాశనం చేస్తున్నాయని విన్నవించారు. ఆవులను పెంపకందారులు వదిలేయకుండా చూడాలని కోరారు. కాగా నగర పంచాయతీ పరిధిలోని రోడ్లపై ఆవులను వదిలేస్తే పెంపకందారులపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. ఇప్పటికే పలుమార్లు ఆవుల పెంపకందారులను హెచ్చరించడం జరిగిందన్నారు. శుక్రవారం నుంచి ఆవులను పట్టుకుని గోశాలకు తరలిస్తామన్నారు.

పశుపోషణలో మెళకువలు పాటించాలి

ఉదయగిరి: పాడిరైతులు పశుపోషణలో మెళకువలు పాటించి పశుసంపదను పెంపొందించుకోవాలని ఉదయగిరి పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు శశిధర్ అన్నారు. స్థానిక సచివాలయం–2లో పాడిరైతులకు పశు విజ్ఞాన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పశుసంచార వైద్యసేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. లంపీస్కిన్ వ్యాధికి సంబంధించి మూగజీవాలకు ముందస్తుగా టీకాలు వేయడం జరిగిందన్నారు. పశుపోషణ, పశువులకు సోకే వ్యాధులు, నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు.

మిరప పంట పరిశీలన

సీతారామపురం: మండలంలోని సంగసానిపల్లిలో సాగు చేస్తున్న మిరప పంటను ఉద్యాన అధికారి సహిల్ బుధవారం పరిశీలించారు. మిరప పంటలో సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. మిరప పంటలో పసుపు, నీలిరంగు జిగురు అట్టలు ఏర్పాటు చేయడం ద్వారా శత్రుపురుగులను నివారించవచ్చన్నారు. ఆయన వెంట వీఏఏ వెంకటేశ్వర్లు ఉన్నారు.

అల్లూరులో కోనసీమ పోలీసులు

అల్లూరు: స్థానిక తూర్పువీధికి చెందిన పిల్లి గోవిందు(48) కోసం కోనసీమ జిల్లా రామచంద్రపురం పోలీసులు బుధవారం ఆరాతీశారు. కోనసీమ జిల్లాలో జరిగిన దారి దోపిడీ కేసులో నిందితుడైన గోవిందును పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు.అయితే గోవిందు కోర్టు వాయిదాలకు హాజరుకాకపోవడంతో కోర్టు ప్రకటించబడిన నేరస్తుడిగా నిర్ధారించి పట్టుకోవాలని కోనసీమ పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు కోనసీమ పోలీసులు బుధవారం అల్లూరు పోలీస్ స్టేషన్‌కు వచ్చి నిందితుడి గురించి ఆరా తీశారు. నిందితుడి ఆచూకీ తెలిసిన వారు 94407 96589 నంబర్‌కు సమాచారం అందించాలని అల్లూరు ఎస్సై పీ శ్రీనివాసులరెడ్డి కోరారు.

28న ద్విచక్ర వాహన వేలం

ఆత్మకూరు: ఆత్మకూరు సెబ్ కార్యాలయంలో ఈ నెల 28న ఓ కేసులో పట్టుబడిన టీవీఎక్స్‌ఎల్ ద్విచక్ర వాహనాన్ని వేలం వేయనున్నట్లు సెబ్ సీఐ బీ నయనతార బుధవారం తెలిపారు. ఆసక్తి కలిగిన వారు రూ.1000 ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

పురోగామిని కుదించాలి

వరికుంటపాడు: జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతిలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు నిర్వహిస్తున్న పురోగామి కార్యక్రమాన్ని రెండో శనివారం, ఆదివారం రోజుల్లో మినహాయించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ ఎస్ మోహన్‌దాస్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమాన్ని ఇతర జిల్లాల్లో 54 రోజులకు రూపొందించి అమలు చేస్తుండగా, జిల్లాలో 63 రోజుల ప్రణాళికతో అమలు చేస్తున్నారన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులకు అటవిడుపుగా ఉన్న రెండో శనివారం, ఆదివారాలను సైతం షెడ్యూల్‌లో పొందుపరచడం దారుణమన్నారు.